# అరుదైన వ్యాధికి అద్భుతమైన చికిత్స




- సర్కార్ దావాఖానలో అత్యాధునిక ఆపరేషన్
- రెండేళ్ల పాపా ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ వైద్యులు
- అపద్బాంధవుల్లా వచ్చి ఆయువును ప్రసాదించిన వైద్యులు
- సర్వత్ర ప్రశంసలు,చిన్నారుల పాలిట 'వరప్రదాయిని'
- విలువైన వైద్యం.. చిన్నారికి పునర్జన్మ
- మృత్యువుతో పోరాడి గెలిచిన రెండేళ్ల పాపా పాయం ఐషు –
- 15 రోజుల సవాలులో ప్రాణాలు నిలబెట్టిన భద్రాచలం ప్రభుత్వ వైద్యులు
- అరుదైన నెఫ్రోటిక్ సింద్రోమ్తో విషమ స్థితిలో ఆసుపత్రికి చేరిన చిన్నారి
- ఖరీదైన అల్బుమిన్ సాయంతోఅద్భుత చికిత్స
- అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు
- ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచిన భద్రాచలం వైద్యులు
- నూతన సంవత్సర వేళ చిన్నారికి 'పునర్జన్మ'








**భద్రాచలం డిసెంబర్ 31 (డిడి9 వార్త) :** మృత్యువుతో పోరాడుతున్న రెండేళ్ల చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తమ సమష్టి కృషితో ప్రాణాపాయం నుంచి కాపాడారు. అసాధ్యమనుకున్న కేసును సుసాధ్యం చేసి, ఆ పాప ముఖంలో చిరునవ్వును నింపారు. 2 సంవత్సరాల పాప పాయం ఐషు 15 రోజులపాటు పోరాడిన తర్వాత పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయింది.

## వివరాల్లోకి వెళ్తే..

ఏఎస్ఆర్ జిల్లా చింతూరు, సర్వెల్ల గ్రామానికి చెందిన పాయం ఐషు 2 సంవత్సరాల బాలిక గత నెల 16న అత్యంత విషమ స్థితిలో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. తల నుంచి కాలి వరకు శరీరం మొత్తం వాపు (Anasarca), తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో బాధపడుతున్న ఆ చిన్నారిని చింతూరు ఏరియా ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రిఫర్ చేయడం జరిగినది.

## సవాలుగా మారిన వ్యాధి..

పరీక్షల అనంతరం చిన్నారి నెఫ్రోటిక్ సింద్రోమ్ (కిడ్నీ సంబంధిత సమస్య), తీవ్రమైన రక్తహీనత, పెరిటోనైటిస్ మరియు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఉన్నత కేంద్రానికి వెళ్లాలని సూచించినప్పటికీ, కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ఇక్కడే చికిత్స అందించాలని వైద్యులు నిర్ణయించారు.

## 15 రోజుల పోరాటం – దాతల సహకారం తో చిన్నారి సేఫ్: ప్రభుత్వ ఆసుపత్రి ఆర్యంఓ

చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి , డాక్టర్ రామకృష్ణ , డాక్టర్ విజయ్ నేతృత్వంలోని వైద్య బృందం చిన్నారికి ఇంట్రావీనస్ యాంటీబయాటిక్స్, కార్టికోస్టెరాయిడ్స్ మరియు ఆక్సిజన్ సాయంతో చికిత్సను ప్రారంభించింది. నిరంతరం పర్యవేక్షణలో భాగంగా ఐ వి ఫ్లూయిడ్స్ , యాంటీబయోటిక్స్ , స్టెరాయిడ్స్ , రక్త మార్పిడి మరియు ఆక్సిజన్ సపోర్ట్ అందించారు. ఈ క్రమంలో ముఖ్యంగా అత్యంత ఖరీదైన, కీలకమైన లభ్యత తక్కువగా ఉండే నాలుగు యూనిట్ల అల్బుమిన్‌ను 'ఐడిఓ' (IDO) సంస్థ సకాలంలో అందించి పాప ప్రాణాలు నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించి తమ ఉదారతను చాటుకుంది. పీడియాట్రిక్ వార్డు సిబ్బంది నీల, సీతకుమారి, వెంకటరమణ, జిజిహెచ్ సిస్టర్స్, ఎన్ఆర్సి డాక్టర్ పూజ మరియు న్యూట్రిషనల్ కౌన్సిలర్ సువర్ణల 15 రోజుల నిరంతర పర్యవేక్షణలో చిన్నారి వేగంగా కోలుకుంది. ప్రస్తుతం పాప పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ కావడానికి సిద్ధంగా ఉంది. చిన్నారి ప్రాణాలు కాపాడిన వైద్యులకు, సిబ్బందికి మరియు సహాయం చేసిన సంస్థకు చిన్నారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య బృందానికి ప్రశంసలు

15 రోజులపాటు అలుపెరగని శ్రమతో చిన్నారిని కోలుకునేలా చేసిన పీడియాట్రిక్ విభాగం చిన్న పిల్లల వైద్య నిపుణులు , ఆర్ఎంవో డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి , డాక్టర్ క్రాప విజయ్ , సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ లను ఉన్నతాధికారులు ప్రశంసించారు. అలాగే విశేష సేవలందించిన పీడియాట్రిక్ వార్డ్ సిస్టర్స్ నీలా సీతకుమారి వెంకటరమణ , ఎన్ ఆర్ సి డాక్టర్ పూజ , న్యూట్రిషనల్ కౌన్సిలర్ సువర్ణ మరియు ఇతర సిబ్బందికి డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రెండు సంవత్సరాల చిన్నారి ఐషు ను అనుభవం కలిగిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి , డాక్టర్ క్రాఫర్ విజయ్ మరియు నర్సింగ్ సిబ్బంది సాహసోపేతంగా నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించి చిన్నారిని కాపాడినందుకు అభినందనలు తెలియజేశారు. అంకిత భవంతో పనిచేసే వైద్యులు , సిబ్బంది ఉండటంతో అసాధ్యం అనుకున్న కేసులను సుసాధ్యం చేసి ప్రాణ పరిస్థితిలో ఉన్న వారికి వైద్యం తో జీవం సాహసోపేతంగా చికిత్స అందించి కాపాడడం గర్వకారణం అని అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా



వైద్యశాల ప్రజలకు నమ్మకం, భరోసా అందిస్తోందనడానికి ఇదే నిదర్శనం" అని అన్నారు. ఈ కేస్ సక్సెస్ కావడం 2025 సంవత్సరానికి ఒక మంచి ముగింపుని ఇచ్చింది. 2026 నూతన సంవత్సరంలో మరిన్ని ప్రాణాలను కాపాడగలమనే ఆశను నింపిందని డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి ఆశాభవం వ్యక్తం చేశారు.

# నయా జోష్..

హైదరాబాద్, డీడీ9 వార్త : అనంత విశ్వంలో కాలచక్రపు పొత్తిళ్లోకి 2025 సంవత్సరం చేరిపోయింది. ఎన్నో తీపి చేదుగుర్తులను మనకు వదిలి మరలిపోయింది. ఆనందోత్సహాలను, నూతనోత్తేజాన్ని నింపి కొత్త అనుభూతుల్ని పంచేందుకు 2026 మన ముగింట నిలిచింది. గత చరిత్రతో కూడిన వర్తమాన అంశాల అనుభవాలు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపంలో అందించేందుకు నూతన సంవత్సరం వచ్చింది. ఈక్రమంలో డిసెంబరు 31ని చిరకాలం గుర్తుండి పోయే ఓ కమ్మని తీపిగుర్తుగా ఘనంగా జరుపుకోవడానికి పట్టణమంతా సిద్ధమైంది. రాత్రి 12 గంటల సమయంలో వేడుకలు జరుపుకోవడానికి యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు సంసిద్ధులయ్యారు. కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో రాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు సిద్ధం చేసుకున్నారు.

## జోరుగా మాంసం, మద్యం విక్రయాలు

వేడుక అంటేనే జోష్, ఎంజాయ్. మధ్యాహ్నం నుంచే మాంసం విక్రయాలు కొనసాగగా మద్యం షాపుల వద్ద సందడి కనిపించింది. పార్టీలు జరుపుకోవడానికి వేదికలను వెతుక్కున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు విభిన్న వంటకాలను తెప్పించుకొని రుచులు ఆస్వాధించారు.

## వస్తువులు, కేకులకు భలే గిరాకీ..

జిల్లా అంతా పలు చోట్ల ఏర్పాట్లు చేసిన కేకుల దుకాణాలు, బేకరీల వద్ద యువత, విద్యార్థుల సందడి కనిపించింది. వస్త్ర నిలయాలు, వ్యాపార సంస్థల వద్ద మహిళలు తమకు నచ్చిన వస్త్రాలు, వస్తువులు, రంగు రంగుల ముగ్గులను కొంటూ కనిపించారు. ద్విచక్రవాహనాలపై కుర్రకారు షికారు చేస్తూ హ్యాపీ న్యూయర్ అంటూ అరుపులతో ఎంజాయ్ చేశారు. జనవరి 1కి స్వాగతం చెబుతూ తమ ఇళ్లలోగిళ్లను రంగులమయం చేసేందుకు రంగులను, టపాసులను కాల్చడానికి పలు రకాల బాంబులు, తారాజువ్వలను కూడా కొనుగోలు చేశారు. దూర దేశాల్లో, పలు ప్రాంతాల్లో ఉన్న వారికి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.